
నీట మునిగిన బండ్లగూడలోని శ్రీనివాస్‌కాలనీ


బండ్లగూడ విజయ్‌గార్డెన్‌లో చేరిన వరద నీరు


బండ్లగూడ శ్రావణి శ్రీ ఎన్‌క్లేవ్ కాలనీలో..


చెరువును తలపిస్తున్న మన్సూరాబాద్-ఆనంద్‌నగర్ రోడ్డు

వర్షం.. ఆగమాగం

రెండవ రోజూ భారీ వర్షం
- జలమయంగా ఎల్‌బీనగర్‌లోని లోతట్టు ప్రాంతాలు
- చెరువులను తలపిస్తున్న కాలనీలు

నాగోలు: గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎల్‌బీనగర్ ప్రాంతంలోని పలు కాలనీలు, రహదారులు నీట మునుగుతున్నాయి. నాగోలు డివిజన్ బండ్లగూడ శ్రీనివాస్‌నగర్ కాలనీలో వరద నీరు పలు ఇళ్లల్లోకి చేరింది. సాగర్ రోడ్డు, విజయ్‌గార్డెన్, శ్రీనివాస్‌నగర్ కాలనీలో మోకాలి లోతు నీరు నిల్వడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పలు కాలనీల్లో వాహనాలు సైతం నీట మునిగిపోయాయి. బండ్లగూడ శ్రావణి శ్రీ ఎన్‌క్లేవ్‌లో భారీగా వరద పలు ఇళ్లల్లోకి చేరింది. బండ్లగూడ శ్రీనివాస్‌నగర్ కాలనీ, శ్రావణి శ్రీ ఎన్‌క్లేవ్ కాలనీలో డ్రైనేజీ మురుగు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బండ్లగూడ పరిధిలోని అయ్యప్పనగర్, మల్లికార్జున్‌నగర్ కాలనీ, జైపురికాలనీ, ఫతుల్లాగూడ, బృందావన్ కాలనీ, మధురానగర్ కాలనీ, అల్కాపురి చౌరస్తా, చింతలకుంట, చైతన్యపురి పరిధిలోని కమలానగర్, కొత్తపేట, నాగోలు చౌరస్తా, సాయినగర్ పరిధిలోని పలు కాలనీలో వరద నీరు చేరింది. ఆనంద్‌నగర్ నుంచి మన్సూరాబాద్‌కు వెళ్లే రహదారి నీట మునిగిపోయింది. వర్షం ఇలాగే కురిస్తే ఎల్‌బీనగర్ ప్రాంతంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతాయని కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు.


మన్సూరాబాద్‌లో ప్రెస్ కాలనీలో..


శ్రీనివాస్ కాలనీలో వర్షం నీటితో ఇబ్బందులు పడుతున్న ప్రజలు


మన్సూరాబాద్‌లో..

సన్మానం


మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్స్‌ను సన్మానిస్తున్న నర్సింహారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా నియమితులైన చిలుక మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్స్‌గా నియమితులైన బండి మధుసూదన్‌రావు, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, గణేష్ నాయక్‌కు రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిలుక నరసింహా రెడ్డి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ కోసం కష్టపడి పనిచేసిన మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్స్‌లను గుర్తించి ఆసియా ఖండంలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్‌గా పేరుగాంచిన గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్స్‌ను నియమించడం అభినందనీయమన్నారు. ఉపేందర్‌రెడ్డి, సైదులు, లింగ స్వామిగౌడ్, ఎల్లన్న, శ్రీకాంత్ రెడ్డి, గోవిందు భువనేశ్వర్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి


సభ్యత్వ నమోదు చేయిస్తున్న సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్‌లో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి తిరిగి సభ్యత్వం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు హర్షం చేస్తున్నారన్నారు. పార్టీ విధానాలు ప్రజలకు వివరించి దేశానికి బీజేపీ పాలన ఆవశ్యతను వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మం, దినేష్, మల్లేష్, పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు సజావుగా జరగాలి


పనులపై చర్చిస్తున్న ఆమ్రపాలి

లింగోజిగూడ: పారిశుద్ధ్య పనులలో లోపలు లేకుండా సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని సరూర్‌నగర్ నుంచి ఎల్‌బీనగర్ రోడ్డు, నాగోలు రోడ్డు మీదుగా ఉప్పల్‌లో పలు ప్రాంతాలలో మంగళవారం ఆమె జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐఏఎస్ అధికారితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమ్రపాలి మాట్లాడుతూ.. కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.చెరువుల వద్ద పారిశుద్ధ పనులు సక్రమంగా నిర్వహించాలని, అంటూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమల బెడద ఉన్న ప్రాంతాలలో ప్రతి రోజు ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నాటి ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతున్న పూర్వ విద్యార్థులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్ఎస్‌సీ (1982–83) బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మంకాల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ బ్యాచ్‌లో కొంతమంది మిత్రులు భౌతికంగా మన మధ్యలేకపోవడం బాధాకరమని అన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నారాయణరెడ్డి, గున్నమయ్య, మల్లారెడ్డి, అనంతయ్య, నారాయణ, మల్లయ్యను ఘనంగా సత్కరించారు. నగేశ్, యాదగిరి, మస్కు శామ్యూల్, అశోక్, లక్ష్మయ్య, చంద్రయ్య, శివకుమార్, వెంకటేశ్‌గౌడ్, నాగేందర్, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిండు కుండలా కుమ్మరి కుంట



లింగోజిగూడ: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కుమ్మరి కుంట నీటితో కళకళలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో పైకాలనీల నుంచి భారీగా వరద వచ్చి చెరువులో చేరుతుండడంతో ఎఫ్‌టీఎల్‌కు చెరుకుంది. చెరువు కట్టను అభివృద్ధి చేసి స్థానికులు సేద తీరేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాలు ఇలాగే కురిస్తే పలు కాలనీల్లోకి నీరు చేరే అవకాశం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. చెరువులోకి వస్తున్న వరదను బాతుల చెరువుకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటే ఎలాంటి సమస్య ఉండదని స్థానికులు చెబుతున్నారు.



కంపు కొడుతున్నా తరలించరా?

ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రధాన రోడ్లలో చెత్త పేరుకుపోతున్నా పట్టించుకునే నాథులే లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త పేరుకుపోయి దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని ఆయా ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను తరలించాలని పలుమార్లు సంబంధిత అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. -లింగోజిగూడ

నేడు డయల్ యువర్ డీఎం

నాగోలు: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, సలహాలు, సూచనలపై బుధవారం బండ్లగూడ డిపోలో డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. రవాణా సమస్యలు, సూచనలు తెలియజేయాలనుకునే వారు సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు 9959224058 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు. టమోటా రూ.43, వంకాయ రూ.35, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.23, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.28, క్యాబేజీ రూ.21, క్యారెట్ రూ.45, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.54, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.21, సొరకాయ రూ15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.70, అర్వి రూ.40, మునగ రూ.105, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్ రూ.28, కీర రూ.25, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.65. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

మహిళ అదృశ్యం


శారద

నాగోలు: ఓ మహిళ అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..గుర్రం ప్రతాప్‌రెడ్డి, భార్య శారద (32)తో కలిసి నాగోలు సాయినగర్ ఉంటున్నాడు. వీరికి పెళ్లై మూడు సంవత్సరాలు అవుతుంది. ఇప్పటి వరకు సంతానం కలగలేదు. ఈ నెల 10న ఇరువురి మధ్య చిన్న గొడవ జరగడంతో శారద ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, తెలిసిన వారు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో భర్త ప్రతాప్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి


దయాకర్

నాగోలు: వ్యభిచారం నిర్వహిస్తున్న పలువురిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా, గజ్వేల్ గ్రామానికి చెందిన రావిశెట్టి దయాకర్(35) నగరానికి వచ్చి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ మన్సూరాబాద్‌లోని హిమపురికాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. వివిధ ప్రాంతాల నుంచి మహిళలను తీసువచ్చి తాను నివాసముండే ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు సోమవారం రాత్రి దయాకర్ నివాసంపై దాడిచేసి ఓ మహిళతో పాటు విటుడిని రిమాండ్‌కు తరలించారు.

స్నూకర్ అండ్ బిలియర్డ్ విజేతగా ముస్తాక్ ఖాన్

కాచిగూడ: బషీర్‌బాగ్‌లోని బిలియర్డ్ స్నూకర్ అకాడమీ ఆధ్వర్యంలో స్నూకర్ అండ్ బిలియర్డ్ 2024 తెలంగాణ రాష్ట్ర చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 15వ రెడ్ విన్నర్‌గా ముస్తాక్ ఖాన్, రన్నర్‌గా టి.సాయి నిలిచారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు నవీన్ గౌడ్, తెలంగాణ క్యూ స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ అప్పారావులు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అభిలాష్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో మహిళలు పాల్గొనాలి


సభ్యత్వ నమోదుపై చర్చిస్తున్న శిల్పారెడ్డి

మన్సూరాబాద్: బూత్‌స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మహిళలు సభ్యత్వ నమోదులో పాల్గొనాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి పిలుపునిచ్చారు. రంగారెడ్డి అర్బన్‌జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు సన్నహక సమావేశం ఎల్‌బీనగర్ చంద్రపురి కాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో అర్బన్ జిల్లాలో 30 వేల సభ్యత్వ నమోదు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. ప్రధానీ నరేంద్రమోదీ అందిస్తున్న పాలన, సంక్షేమ పథకాలను వివరిస్తూ అధిక సంఖ్యలో సభ్యత్వం నమోదు చేయించాలన్నారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

సత్కారం


మహేష్ కుమార్ గౌడ్‌తో రామ్మోహన్‌గౌడ్

ఎల్‌బీనగర్: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను మంగళవారం ఆ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

హస్తినాపురం: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మంగళవారం గాంధీభవన్‌లో హస్తినాపురం జయకృష్ణ ఎన్‌క్లేవ్ కాలనీకి చెందిన టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ను శ్రీకాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ


పోషకాహారంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ శాంతిశ్రీ

మహేశ్వరం: బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్‌లో భాగంగా పోషకాహారం, పరిశుభ్రత గురించి గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమన్నారు. పుట్టిన వెంటనే తల్లి బిడ్డకు పాలు పట్టిస్తే పిల్లలకు వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. బిడ్డకు ఆరునెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను ఎప్పటికప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు తల్లి పాల ప్రాముఖ్యత, పరిశుభ్రం గురించి అవగాహన కల్పించారు. అనంతరం పోషకాహారంపై బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయించారు. క్యాక్రమంలో ఎంపీడీఓ శైలజ, దుబ్బచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మల్లికార్జున్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మేఘాలయలో కార్పొరేటర్ల పర్యటన


ఉత్తమ శుభ్రత గ్రామంలో కార్పొరేటర్లు

నాగోలు: జీహెచ్ఎంసీ స్టడీ టూర్‌లో భాగంగా కార్పొరేటర్లు ఈశాన్య రాష్ట్రమైన మేఘాలయ పర్యటిస్తున్నారు. మావలాంగ్(మేయిలన్నాంగ్) ఆసియాలోనే ఉత్తమ శుభ్రత గల పల్లెటూరుగా అవార్డు అందుకున్న గ్రామంలో మంగళవారం కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, గడ్డి అన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి పర్యటించారు. అక్కడి ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌రహిత ఊరుగా నిర్ణయించుకుని ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించారు. చెత్త వ్యర్థాలను రోడ్లపై వేయకుండా ఎక్కడికక్కడ చెత్త బుట్టలు పెట్టడం, అదే విధంగా చెత్తను స్వచ్ఛ బండిల్లోనే వేస్తామని నిర్ణయం తీసుకొని దానికి కట్టుబడి ఉండటం అభినందనీయమన్నారు

పాఠశాలలో క్విజ్‌పై వివాదం

పలువురిపై కేసులు

సైదాబాద్: పాఠశాలలో నిర్వహించిన క్విజ్ పోటీలు వివాదానికి దారి తీసిన ఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జమాతే ఇస్లామి హింద్ మలక్‌పేట శాఖ ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త జన్మదిన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 3న సంస్థ ప్రతినిధులు సైదాబాద్ కాలనీలోని ఓ పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు ఈ నెల 12న సర్టిఫికెట్లు అందజేశారు. అయితే కొందరు తల్లిదండ్రులు, వారికి మద్దతుగా పలువురు బీజేపీ నాయకులు సోమవారం పాఠశాల వద్దకు వచ్చి తమ పిల్లలకు అన్యమత ప్రచారం ఎలా నిర్వహిస్తారని వాదానకు దిగారు. అందులో కొందరు పాఠశాల కార్యాలయ గది అద్దాలు ధ్వంసం చేశారు. అనంతరం ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

27న శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకు గోరక్ష మహా పాదయాత్ర

కాచిగూడ: అఖిల భారత గోసేవ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ నెల 27న శ్రీనగర్‌లోని శ్రీశంకరాచార్య దేవాలయం నుంచి మహాపాదయాత్ర ప్రారంభమై జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, న్యూఢిల్లీ, హరియాణా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మీదుగా కన్యాకుమారి వరకు 27 మార్చి 2025 వరకు చేరుకుంటుందని లవ్ ఫర్ కావ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జస్మత్ పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కాచిగూడ లోని ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గోవద నిషేద చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గోరక్షణ కోసం బాలకృష్ణ గురుస్వామి చేస్తున్న మహా పాదయాత్రకు ప్రతి ఒక్కరూ మద్దతు ప్రకటించి తమవంతుగా సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. గోవును రక్షిస్తేనే భారత దేశం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉంటుందని ఆయన తెలిపారు. గో రక్ష మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆక్యుపంక్చర్ వైద్యానికి కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో ఆక్యుపంక్చర్ వైద్యానికి కౌన్సిల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆక్యుపంక్చర్ ఆక్యుప్రెషర్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.సుధీర్, ప్రధానకార్యదర్శి డాక్టర్ పిఎస్ సాగర్, కోశాధికారి జి.సుభాష్ ప్రభుత్వాన్ని కోరారు. అసోసియేషన్ సమావేశంలో తీసుకున్న తీర్మాణాలను వివరిస్తూ ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం ఓ ప్రకటనలో వారు విజ్ఞప్తి చేశారు. భారత ప్రభుత్వం ఐసీఎంఆర్, డీహెచ్ఆర్ నేతృత్వంలోని స్టాండింగ్ కమిటీ 2018లో అక్యుపంక్చర్ వైద్యాన్ని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థగా ఆమోదించిందని, అదే విధంగా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అక్యుపంక్చర్ వైద్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ఈ వైద్య విధానాన్ని ఆమోదించాయని, అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. దేశంలో ఈ అక్యుపంక్చర్ వైద్యాన్ని విస్తృతం చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ రాకేష్ జైస్వాల్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ త్రివిక్రమ్, టి.అనిల్ కుమార్, ఎస్.రవీందర్, జె.పురుషోత్తం, అనిరుద్, అభిషేక్, ఆర్.సత్యం తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జీజేఎల్ఏ అధ్యక్షుడిగా ప్రసాదరావు



కాచిగూడ: హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (జీజేఎల్ఏ) అధ్యక్షుడిగా కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ లెక్చరర్ వి.ప్రసాదరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం కాచిగూడలోని కళాశాలలో వి.ప్రసాదరావును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి, తోటి లెక్చరర్స్ ఘనంగా సత్కరించి అభినందించారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE : RANGA REDDY DISTRICT : AT : L.B.NAGAR
G.W.O.P.No. 84 of 2024

Between :
1. Kusuluri Madhu S/o. K.D.M.Raju, Aged about 46 years, Occ: Software Employee,
2. Kusuluri Abhay Charan, S/o. Kusuluri Madhu, Aged about 12 years, Occ: Student,
3. Kusuluri Vijay Krishna, S/o. Kusuluri Madhu, Aged about 07 years, Occ: Student,
being minors of Petitioner No.2 & 3,
rep. by their Father and Natural guardian Kusuluri Madhu i.e. 1st petitioner herein
All are R/o. Plot No.280, Prashanth Nagar, Vanasthalipuram, R.R.District- 500070.
...Petitioners

And

All concerned ...Respondent

NOTICE

That the Petitioner has filed the above said G.W.O.P. 84 of 2024, under section 29 of Guardian & Wards act 1890 & sec. 8 of Hindu Minority & Guardianship act 1956, to appoint Petitioner (Father) herein as Guardian to his minor son's, Kusuluri Abhay Charan, Aged about 12 years and Kusuluri Vijay Krishna, Aged about 07 years and grant permission to sell in Petition Schedule Property i.e bearing plot No. 64 in Sy.No. 538, admeasuring an extent of 200 Sq.Yds or its equivalent to 167.23 Sq. Mtrs situated at Pedda Amberpet Village, Abdullapurmet Mandal, Ranga Reddy District and bounded by : North : Plot No. 65, South : Plot No. 63, East : 25 Feet Wide Road, West : Plot No. 71, all concerned and above case is posted to 04-10-2024, before the Hon'ble Court and if anybody is having any interest/claim over the said property, they may appear the Hon'ble court on 04-10-2024 at about 10.30 A.M, either in person or through their Counsel and, in the absence of any such objection, the Hon'ble Court shall proceed further and pass appropriate order.

// BY ORDER OF THIS COURT //
G.VENKATESH & B. NARESH - Advocates